క్లుప్తంగా...

కండక్టర్‌కు ఆర్థిక సాయం



వెంకటమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న డీఎం, ఉద్యోగులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డిపో కండక్టర్ వెంకటమ్మ డ్యూటీకి వస్తుండగా, యాక్సిడెంట్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. దీంతో డీఎం శ్రీనాథ్, సిబ్బంది వెంకటమ్మను బుధవారం పరామర్శించారు. ఆర్థిక సాయంగా రూ.80 వేలను అందజేశారు. అదేవిధంగా రాజేంద్రనగర్ డిపో ఎస్‌టీఐ సుశీల మహిళా దినోత్సవం సందర్భంగా రూ.5 వేలను వెంకటమ్మకు అందజేశారు. కార్యక్రమంలో టీఐ–3 ఏపీరెడ్డి, డిపో కంట్రోలర్లు, ఎంహెచ్ అలీ, అనంతయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో సంబరాలు



రాజేంద్రనగర్ డీఎం శ్రీనాథ్‌ను సత్కరిస్తున్న ఎండీ సజ్జనార్

రాజేంద్రనగర్: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో కళాభవన్‌లో గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ 2023–24 సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్తమ సేవలందించి ప్రథమ స్థానంలో నిలిచిన రాజేంద్రనగర్ డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ సంస్థ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఈ అవార్డు తన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు.

సన్మానం

రాయదుర్గం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలో కాంగ్రెస్ నాయకుడు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ గచ్చిబౌలి డివిజన్ పారిశుద్ధ్య మహిళా కార్మికులు, ఆశ వర్కర్లు, టీచర్లు, డాక్టర్లు, షీ టీమ్ ప్రతినిధులు, మహిళా పోలీసులు, స్ట్రీట్ వెండర్లు, సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితాగౌడ్, ఇతర మహిళా ప్రతినిధులను భరత్‌కుమార్, కృష్ణాగౌడ్ ఘనంగా సత్కరించారు.

మహిళలు దృఢంగా ఉండాలి

గచ్చిబౌలి: మహిళలు దృఢంగా ఉంటేనే సమాజం కూడా బాగుంటుందని సినీ నటి కుషిత కల్లపు పేర్కొన్నారు. కొండాపూర్‌లోని అపోలో క్రెడిల్‌లో 'స్ట్రాంగ్ ఉమెన్, స్ట్రాంగ్ భారత్' అనే అంశంపై శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుటుంబం పట్ల ఎంత శ్రద్ధ వహిస్తారో తమ పట్ల కూడా వహించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో బాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు చెకప్ చేయించుకొని వైద్యుల సలహాలను పాటించాలన్నారు. అపోలో క్రెడిల్ ప్రసూతి గైనకాలజిస్ట్ డాక్టర్ సుధామాధురి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండటం చాలా కీలకమన్నారు. అపోలో క్రెడిల్‌లో ప్రేమ అప్యాయతతో మహిళలకు సంరక్షణ అందిస్తున్నామన్నారు. గైనకాలజిస్టులు డాక్టర్లు వంగళ్ళ పద్మిని శిల్ప, శ్వేతా సికర్వార్, హరికారెడ్డి, నందిని ప్రసంగించారు.

ఎన్‌ఎస్‌యూఐ జాగృతియాత్ర

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ జాగృతి యాత్రను ఎన్ఎస్‌యూఐ కోఆర్డినేషన్ సభ్యుడు పట్లోళ్ళ శ్రీరామ్‌యాదవ్ జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రభాకర్‌సింగ్, నేహ జయరాజ్, శ్రీరామ్ యాదవ్, ప్రణతి, దారం మహేష్ పాల్గొన్నారు.

బిల్డర్‌పై కేసు

మణికొండ: విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అధికారులను దూషించిన బిల్డర్‌పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్‌లో చెరువు బఫర్ జోన్‌లో విల్లాలను 4 రోజుల క్రితం కూల్చేందుకు అధికారుల బృందం వెళ్లగా బిల్డర్ గోవర్ధన్ అడ్డుకున్నారు. ఆ రోజు పోలీసు బందోబస్తు లేకపోవడంతో వారు వెనుదిరిగారు. అక్కడితో ఆగకుండా గండిపేటలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సదరు బిల్డర్ తహసీల్దార్‌తో వాదనకు దిగారు. ఏకంగా తనకు సీఎం సోదరుడితో సత్సంబంధాలు ఉన్నాయని, తాను తల్చుకుంటే నీ అంతు చూస్తానని బెదిరించినట్లు సమాచారం. గురువారం పూర్తి స్థాయి పోలీసు బందోబస్తుతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వెళ్లి ప్రహరీతో పాటు ఐదు విల్లాలను కూల్చివేశారు. అనంతరం కలెక్టర్ ఆదేశాలతో వారు బిల్డర్‌పై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ప్రశాంత్‌నగర్ కాలనీలోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దర్శనానికి బారులు తీరిన భక్తులు



మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

వైభవంగా మహా శివరాత్రి

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తుల ప్రత్యేక పూజలు



మంచిరేవుల మచిలేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులు



బుద్వేల్ శివాలయంలో ఉపవాస దీక్షలు విరమిస్తున్న భక్తులు



మణికొండ శివాలయంలో భక్తుల సందడి

రాజేంద్రనగర్ జోన్ బృందం: నియోజకవర్గంలో మహా శివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు పెద్ద ఎత్తున తరలిరాగా కిటకిటలాడాయి. తెల్లవారుజామున 2 గంటల నుంచే అభిషేకాలు ప్రారంభం కాగా శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. అనంతరం స్వామి వారిని అలంకరించి కల్యాణ మహోత్సవాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి భక్తుల రద్దీ మరింత పెరిగింది. స్వామి వారిని దర్శించుకొని కుటుంబ సమేతంగా ఆలయాల ప్రాంగణంలోనే ప్రసాదాలు స్వీకరించి ఉపవాసాలు విరమించారు. ఆలయాలను వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేయగా మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో చూడముచ్చటగా కనిపించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే పోలీసులు దేవాలయాల వద్ద భారీ బందోబస్తును చేపట్టారు.



నార్సింగిలో శివుడికి అభిషేకం చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్



పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు



రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ప్రసాదం అందజేస్తున్న వేముల శ్రీనివాస్



భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయం



విజయగణపతి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజలందుకున్న మణికొండ పార్వతీరామలింగేశ్వరుడు



మంచిరేవులలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



అభిషేకం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులు

శివోహం పెయింటింగ్ పోటీలు ప్రారంభం



పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న కళాకారులు

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శివోహం పెయింటింగ్ పోటీలను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.మనోహర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలోని భక్తిని అనేక రకాలుగా చూపించవచ్చని అందులో భాగంగానే చిత్రకారులు పెయింటింగ్ రూపంలో చూపుతారన్నారు. వారిలోని కళను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించేందుకే యేటా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు 32 మంది కళాకారులు పాల్గొన్నారని, ఆదివారం వరకు కొనసాగుతాయన్నారు. చివరి రోజు ఉత్తమ పెయింటింగ్‌లకు బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు రాంప్రతాప్, ఎస్. రామకృష్ణ, శివరామకృష్ణతో పాటు పెద్ద ఎత్తున కాలనీ వాసులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ.. భూమి పూజ



భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

గచ్చిబౌలి: మసీద్‌బండ గ్రామంలో నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠకు శుక్రవారం భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్, స్థానికులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

రాజకీయ శాస్త్రవేత్త ప్రొ.జోయాహసన్



ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

రాయదుర్గం: మహిళా సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదని ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త జేఎన్‌యూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ జోయాహసన్ పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని మనూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆరవ అంతర్జాతీయ ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా ప్రత్యేక సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా 'కౌంట్ హర్ ఇన్: జెండర్ ఈక్వాలిటీ త్రూ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. మహిళలను ప్రోత్సహిస్తే తమ సత్తా చాటుతారని అన్నారు. ఏఎంయూ డైరెక్టర్ ట్రిబాక్ న్యూఢిల్లీ మాజీ ప్రొఫెసర్ అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం ద్వారా మహిళా సాధికారత జరుగుతుందన్నారు. హెచ్‌సీయూ సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్, హిస్టరీ విభాగం ప్రొఫెసర్ రేఖా పాండే మాట్లాడారు. కార్యక్రమంలో జేఎన్‌యూ ఎకనామిక్స్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, మనూ ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షుగుప్తా షాహీన్, మనూ ఎకనామిక్స్ గౌరవ ప్రొఫెసర్ అమితాబ్ కుందు, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు ప్రొ.అమీరుల్లాఖాన్, మాజీ వీసీ ప్రొ. రహమతుల్లా, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, కో కన్వీనర్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ముస్తాజాబ్ ఖతీర్ ప్రసంగించారు.

ట్యాంకర్ కిందపడి సైక్లిస్ట్ మృతి

గచ్చిబౌలి: ప్రమాదవశాత్తు ట్యాంకర్ కింద పడి ఓ సైక్లిస్ట్ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేందర్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన రమేష్ బెహ్రా(43) శ్రీరాంనగర్ కాలనీ ఏ బ్లాక్‌లో నివాసం ఉంటూ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో శ్రీరాంనగర్‌కాలనీ సీ బ్లాక్‌లో సైకిల్‌పై వెళుతుండగా ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంకర్ వెనక టైరు కిందపడటంతో తల ఛిద్రమై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఫ్లోటిల్లా గేటెడ్ కమ్యూనిటీలో జరిగిన వేడకల్లో పాల్గొన్న మహిళలు



నార్సింగిలో మహిళలను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్లోటిల్లా గేటెడ్ కమ్యూనిటీలో వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.సుష్మామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబం, సమాజ పరంగా మహిళలు అనేక పనులు నిర్వర్తించి సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారన్నారు. స్త్రీలకు విద్య, స్వేచ్ఛ ఎంతో అవసరమని, అవి ఉన్నప్పుడే వారు అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పేద మహిళకు ఉపాధి కల్పించేందుకు కె.నాగరాజు, నవ్య కుట్టుమిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు వి. వంశీకృష్ణ, కార్యదర్శి టి.యశ్వంత్, కోశాధికారి శిరీష, జోన్ చైర్మన్ కె. నిరీష, రీజియన్ చైర్మన్ జి.నవీన్‌కుమార్, కార్యదర్శి రామ్‌సురేశ్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

నార్సింగిలో..

నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో విశిష్ట సేవలు అందిస్తున్న కార్మికులు, రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీసులను సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పవన్‌కుమార్, శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలోని పీహెచ్‌సీలో..

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లిలోని పీహెచ్‌సీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, ఇతరులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రేఖా, సీహెచ్‌ఓ మహ్మద్ సిరాజుద్దీన్, బాలరాం, డాక్టర్ హీనా, కేశవ్, శివ కుమార్ పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో..

అత్తాపూర్: అత్తాపూర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమామహేశ్వరి రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఆమె సత్కరించారు.



వేడుకల్లో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



వేడుకల్లో పాల్గొన్న ఉమామహేశ్వరిరెడ్డి

వెలగని స్ట్రీట్ లైట్లు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు

- లింగంపల్లి రైల్వేస్టేషన్ ఆరో ప్లాట్‌ఫారమ్ వైపు వెలగని వీధి దీపాలు
- పది రోజులుగా అవస్థలు పడుతున్న ప్రయాణికులు



అండర్ బ్రిడ్జి నుంచి రైల్‌విహార్ కాలనీ నాలా వరకు చీకటిగా ఉన్న దృశ్యం



శేరిలింగంపల్లి: నగర శివారులో అతిపెద్ద రైల్వే స్టేషన్, భారీ సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే లింగంపల్లి రైల్వేస్టేషన్ 6వ ప్లాట్‌ఫారమ్ వైపు పది రోజులుగా సుమారు ఒక కిలోమీటరు వరకు స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు. ముఖ్యంగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రైల్ విహార్ కాలనీ సమీపంలోని నాలా వరకు లైట్లు వెలగకపోవడంతో ప్రయాణికులు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిసర కాలనీలు, బస్తీలు ఉండడం.. ఎక్స్‌ప్రెస్ రైళ్ళు, ప్యాసింజర్ రైళ్లతో బాటు ఎంఎంటీఎస్ రైళ్ళు సికింద్రాబాద్, నాంపల్లి, ఫలక్‌నామ వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో స్ట్రీట్ లైట్లు వెలగపోవడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. ముఖ్యంగా దొంగల భయంతో బాటు కుక్కలు కూడా సంచరిస్తుండడంతో భయపడాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రైల్వేస్టేషన్ పట్ల ఇదేం నిర్లక్ష్యం అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గచ్చిబౌలి పోలీసులు గుర్తించారు. ఈ నెల 4వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో గోపన్‌పల్లిలోని వైన్‌షాపు వెనుక సిట్టింగ్ ప్రదేశంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సర్వశ్రీ కుమార్(55). ఎన్‌టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఐస్‌క్రీం బండి నిర్వహిస్తున్నాడు. వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి తాగి పడిపోయాడు. వైన్ షాపు నిర్వాహకులు గమనించి గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.